'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## 'ఆమె'కు ఆర్థిక నోబెల్

**ఆకాశంలో** సగమని అందంగా చెప్పుకొనే మహిళ ఆర్థికంలో మాత్రం అధఃపాతాళంలోనే ఉండిపోయింది. వ్యవసాయ కూలీల దగ్గరి నుంచి సినిమా హీరోల దాకా మగవారిదే రాజ్యం. మగ మహారాజుల ఆదాయం ముందు మహిళలు ఎందుకూ సరిపోరన్నది జగమెరిగిన సత్యం. చారిత్రక క్రమంలో ఈ సత్యం ఎలా పాతుకుపోయిందో తన లోతైన పరిశోధనల ద్వారా వివరించినందుకు అమెరికా ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌కు ఈ ఏడాది ఆర్థిక నోబెల్ బహూకరించారు. 'శ్రామికశక్తిలో మహిళలు, లింగ సమానత్వం' అనేది ఆమె పరిశోధనాంశం. సుమారు 200 ఏండ్ల అమెరికా చరిత్రను తవ్విపోసి, సంపాదనలో మహిళ క్రమానుగత పతనాన్ని లెక్కతేల్చి చూపారు ఆమె. ఆర్థిక నోబెల్‌ను ఇప్పటిదాకా ముగ్గురంటే ముగ్గురే మహిళలు గెల్చుకోవడం గమ్మత్తయిన విషయం. మూడో విజేత అయిన గోల్డిన్ ఒంటరి విజేతగా రికార్డు సృష్టించారు. గత 55 ఏండ్లలో 93 మందికి ఈ బహుమతినివ్వగా అందులో ముగ్గురు మాత్రమే మహిళలు. ఇదీ గోల్డిన్ అధ్యయనం చేసిన వ్యత్యాసాల వలె ఉండటం ఓ వైచిత్రి.

'శ్రామికశక్తిలో మహిళల పాత్ర గురించి అవగాహన చేసుకోవడం సమాజానికి చాలా కీలకం' అని బహుమతి ప్రదానోత్సవంలో నోబెల్ కమిటీ పేర్కొన్నది. శ్రామికశక్తితో పాటుగా, చట్టసభలు సహా అన్నిరంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచాలనే ఆలోచనలు విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో గోల్డిన్ నోబెల్ గెలుపు ఓ మేలుమలుపు. కచ్చితమైన డాటా అందుబాటులో లేకపోవడమనేది ఆమెను వేధించింది. జనాభా లెక్కల్లో మహిళలను గృహిణులుగా ఒకేగాటన కట్టేసి, చేసే పనేమిటో, వచ్చే ఆదాయమేమిటో సూచించేవారు కాదు. ఇలాంటి సవాలక్ష సమస్యలతో పోరాడుతూ ఆమె ప్రధానంగా అమెరికా సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు సాగించారు. ఆమె సూత్రీకరణలు పైపైన చూస్తే తెలిసినట్టే అనిపిస్తాయి. కానీ, వాటి వెనుక గల ఆర్థిక కోణాలను, చారిత్రక పరిణామాలను ఆవిష్కరించడం ఆమె ప్రత్యేకత. ఇవి భారత్‌తో సహా ఇతర దేశాలకు, రకరకాల స్థాయిలో వర్తిస్తాయని చెప్పవచ్చు. వ్యావసాయిక సమాజంలో మహిళ పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేది. పారిశ్రామిక విప్లవం రాకతో మహిళ పరిస్థితి దిగజారింది. ఇల్లు విడిచిపెట్టి ఫ్యాక్టరీకి వెళ్లాల్సి రావడమనేది సమస్యగా మారింది. మరీ ముఖ్యంగా పెండ్లయిన మహిళలు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చేది. మహిళలకు విద్యావకాశాలు లభించి, సేవలరంగం విస్తరించిన తర్వాత పరిస్థితి మెరుగుపడింది.

గర్భనిరోధక సాధనాలు ప్రవేశపెట్టిన తర్వాత శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని గోల్డిన్ సోదాహరణంగా రుజువు చేయడం విశేషం. అయినప్పటికీ గర్భం ధరించడం, పిల్లలను కని పెంచడం అనేవి మహిళల్ని కెరీర్‌లో పైకి పోకుండా ఆపుతున్నాయి, వేతన వ్యత్యాసాలకు కారణమవుతున్నాయి. ఈ తరహా కార్యకారణ పరిశోధనలు ఇంతకుముందెవరూ చేయకపోవడం గమనార్హం. ఆధునిక యుగంలో వేతనాల్లో మహిళల పట్ల వివక్ష ఎందుకు, ఎలా కొనసాగుతున్నదో కూడా గోల్డిన్ సాధికారికంగా విశ్లేషించారు. పరదా చాటున కూర్చోబెట్టి సంగీత వాయిద్యకారులకు ఉద్యోగ నియామక పరీక్షలు నిర్వహించడం మొదలుపెట్టిన తర్వాత వాయిద్య బృందాల్లో మహిళల చేరికలు పెరిగిపోయాయంటూ ఆమె ఇచ్చిన ఉదాహరణ అందరినీ ఆలోచింపజేసింది. ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా సంపన్నదేశాల్లోని యువతలో స్త్రీపురుష వేతన వివక్షలు వేగంగా తగ్గుతున్నాయనే గోల్డిన్ నిర్ధారణ ఒక ఆశావహ పరిణామం!

# ఇదీ.. స్థానిక పార్టీల సత్తా!

గడిచిన 15-20 ఏండ్లలో జరిగిన పలు రాష్ట్రాల 3-4 పర్యాయాల అసెంబ్లీ ఎన్నికల తీరు తెన్నులను విశ్లేషిస్తే... కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ స్థానిక పార్టీలను ఓడించిన దాఖలాలు ఒక్కటి, అర మినహా ఎక్కడా మనకు కానరావు.



పెండ్యాల మంగళాదేవి




2011, పశ్చిమబెంగాల్‌లో స్థానిక పార్టీ అయిన టీఎంసీ 34 ఏండ్ల కమ్యూనిస్టుల పాలనకు చరమగీతం పాడి అధికారంలోకి వచ్చింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పోటీ చేసినప్పటికీ టీఎంసీకి మూడింట రెండొంతుల కంటే ఎక్కువగా మెజారిటీ వచ్చింది. 2021లో జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున టీఎంసీ నాయకులను బీజేపీలో చేర్చుకొని, ఇతర కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులను చేర్చుకొని మోదీ, షాలు అంతా తామై ప్రచారం చేశారు. అయినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 2016 కంటే ఎక్కువ అసెంబ్లీ సీట్లు సంపాదించింది. కాంగ్రెస్ 2016లో భంగపడితే. 2021లో బీజేపీ భంగపడ్డది.

2013లో ఢిల్లీ ఎన్నికల్లో 15 ఏండ్ల కాంగ్రెస్ పాలనను స్థానిక పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అంతమొందించింది. ఆ పార్టీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2015లో మోదీ, కాంగ్రెస్‌ను నిలువరించి 96 శాతం సీట్లను కైవసం చేసుకున్నది. 2020లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఎన్ని విధాలుగా ప్రయత్నం చేసినప్పటికీ ఆప్ 90 శాతం సీట్లు సాధించింది. 2000లో ఒడిశాలో కాంగ్రెస్ నుంచి అధికారం చేజించుకున్న స్థానిక పార్టీ అయిన బీజేడీని ఇప్పటివరకు జరిగిన ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కానీ , బీజేపీ కానీ ఓడించలేకపోయాయి. 23 ఏండ్లుగా నవీన్ పట్నాయక్ ఓటమి ఎరుగని ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. పంజాబ్‌లో బీజేపీ కూటమితో అకాలీదళ్ లేక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేవి. కానీ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నిల్లో కాంగ్రెస్, బీజేపీ కూటములను మట్టి కరిపించి ఆప్ అధికారాన్ని కైవసం చేసుకున్నది.

కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, అసోం వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ లేకుంటే బీజేపీ కూటములు అధికారంలోకి వస్తున్నాయి. యూపీలో మాత్రమే స్థానిక పార్టీ నుంచి బీజేపీ అధికారం కైవసం చేసుకోగలిగింది. బీహార్‌లో బీజేపీతో లేకుంటే కాంగ్రెస్‌తో జతకట్టి స్థానిక పార్టీ జేడీయూ 2005 నుంచి అధికారంలో కొనసాగుతున్నది. తమిళనాడులో గత 60 ఏండ్లుగా కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ ఎలాంటి ప్రభావం చూపలేదు. స్థానిక పార్టీలే అధికారంలోకి వచ్చాయి. గడిచిన 15-20 ఏండ్ల చరిత్రను పరిశీలిస్తే బలంగా ఉన్న స్థానిక పార్టీనీ, ప్రజాదరణ కలిగిన ఆ పార్టీ నేతను కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ ఓడించలేకపోయాయనేది చారిత్రక సత్యం.

1945-46లో బ్రిటిష్ ఇండియాలో జరిగిన ఎన్నికల ఫలితాల ఆధారంగా స్వతంత్ర సమర యోధుడు నెహ్రూ 1947లో ప్రధానిగా అధికారం స్వీకరించారు. 1952, 57, 62లో దేశ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి తాను 1964లో మరణించేవరకు ప్రధానిగా కొనసాగారు. తదనంతరం 13 ఏండ్లపైన కాంగ్రెస్ అధికారం కొనసాగింది. తమిళనాడులో ఎంజీఆర్ 1977లో తన ఏఐఏడీఎంకేను అధికారంలోకి తెచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే తన ముఖ్యమైన అజెండాగా పరిపాలన కొనసాగించారు. తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా కొనసాగారు. తాను బతికిఉండగా డీఎంకే కానీ, కరుణానిధి కానీ అధికారంలోకి రాలేకపోయారు.

ఇక ఉమ్మడి ఏపీలో 1983 నుంచి జరిగిన 40 ఏండ్లలో అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే 1989లో మర్రి చెన్నారెడ్డి, 2004లో రాజశేఖరరెడ్డి (2009లో స్వల్ప మెజారిటీ) మినహా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన నాయకుడు లేడు. ఆ ఇద్దరిలో పావు వంతు ప్రజాదరణ కలిగిన నాయకులు గడిచిన పదేండ్లలో కాంగ్రెస్‌లో కానీ, బీజేపీలో కానీ తెలంగాణలో లేనే లేరని రాజకీయ బుద్ధిజీవులు అభిప్రాయపడుతున్నారు.

14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంతో, చావును సైతం లెక్కచేయకుండా పంతం పూని తెలంగాణను సాధించిన తెలంగాణ ముద్దు బిడ్డ కేసీఆర్. ఉమ్మడి ఏపీలో 2014లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ మెజారిటీ సాధించి, తెలంగాణ ఏర్పడిన రోజునే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, అనేక కుట్రలను ఛేదించి తెలంగాణలో సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. సంక్షేమం, అభివృద్ధి అనే జోడెడ్ల బండితో తెలంగాణను ప్రగతిపథంలో పరుగెత్తించారు.

తెలంగాణ రాష్ట్రంలో 2018 డిసెంబర్‌లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో మహాకూటమి పేరిట సుమారు 9 పార్టీలు జతకట్టాయి. పొత్తులతో కాంగ్రెస్ పోటీ చేసినప్పటికీ మూడొంతుల మెజారిటీతో కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

అభివృద్ధి-సంక్షేమం, వ్యవసాయంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు. ఇప్పుడు తెలంగాణ ఆచరిస్తే దేశం అనుసరిస్తున్నది అనే స్థాయికి తెలంగాణను కేసీఆర్ తన పదేండ్ల పాలనలో తీసుకుపోయారు. ఈ నిజాన్ని విమర్శకులు సైతం ఒప్పుకుంటున్నారు. తెలంగాణలో జరిగే రెండవ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు కానీ, బీజేపీ కానీ ఉండదని గడిచిన 20 ఏండ్ల చరిత్ర, పలు రాష్ట్రాల 3-4 పర్యాయాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే అర్థమవుతుంది.



# రాళ్లు మొలిచిన నేలపై.. నీళ్లు పూచిన వేళ!

నా తెలంగాణ.. కోటి రతనాల వీణ- దాశరథి
నా తెలంగాణ.. కోటి ఎకరాల మాగాణ- కేసీఆర్

తరాల తరబడి విలయ తాండవం చేసిన కరువు నేలను 'కోటి ఎకరాల మాగాణంగా మార్చేస్తా' అనే లక్ష్యం పెట్టుకోవాలంటే సముద్రమంత సంకల్పం ఉండాలి. అసాధ్యంగా కనిపించే కలలను నిజం చేసి చూపెట్టగలిగే పట్టుదల కావాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనా కొండలను సైతం పిండి చేస్తూ ముందుకు వెళ్లగలిగే ఆత్మస్థైర్యం కావాలి. ఎత్తుకున్న జెండాను ఎగరేసేదాన్క వెనుకడుగే తెలియని మొండితనం కావాలి. అది సాధ్యమవుతుందనే విషయం నిజం అయ్యేదాకా చాలామంది నమ్మలేదు. ఉద్యమ నాయకుడే అభివృద్ధి సారథి కావటం వల్ల సాధ్యమైందన్న విషయం విమర్శకుల నోళ్లకు తాళం వేసింది.

ముగ్గురు ముఖ్యమంత్రులు మారితే తప్ప ఒక్క ప్రాజెక్టు పూర్తికాలేదు గతంలో. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును మూడేండ్ల చిరుప్రాయంలోనే పూర్తిచేసి చూపించటం అనేది ప్రతిపక్షాలు కలలో కూడా ఊహించలేకపోయిన అద్భుతం. చైనాలో మాత్రమే సాధ్యమయ్యే నిజం. కానీ, ఆ అద్భుతం మొట్టమొదటిసారిగా భారతదేశంలోని ఒక చిన్న రాష్ట్రంలో ఆవిష్కృతమైంది. ఆ రాష్ట్రం పేరు తెలంగాణ, ఆ రాష్ట్రం వయస్సు పదేండ్లు మాత్రమే. 75 ఏండ్ల స్వతంత్ర భారతావనికి కూడా సాధ్యం కాని లక్ష్యాన్ని కేవలం మూడేండ్లలోనే ఒక చిన్న రాష్ట్రం సాధించిందంటే మహాద్భుతం కాక మరేమవుతుంది.

కాళేశ్వరం ప్రాజెక్టును జీర్ణించుకునేలోపే ప్రతిపక్షాల నెత్తి మీద పడ్డ మరో భారీ పిడుగు 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతల ప్రాజెక్టు. కరువును ఇంటి పేరుగా మార్చుకొని, కుటుంబాన్ని సాకటం కోసం వలసలు వెళ్లిన కరువు నేల పాలమూరు. రాళ్లను తప్ప నీళ్లను చూడని నేల పాలమూరు. నీళ్ల కోసం ఏడ్చి ఏడ్చి కళ్ళల్లో నీళ్లు ఇంకిపోయిన నేల పాలమూరు.

రాష్ట్ర సాధన కోసం కంకణం కట్టుకున్నప్పుడే పాలమూరు కోసం పట్టుబిగించిన పిడికిలి రాష్ట్రాన్ని సాధించిన వెంటనే పాలమూరుకు పచ్చ కోక కట్టే పనికి శ్రీకారం చుట్టింది. పాలమూరుకు నీళ్లు వస్తున్నాయంటే ఆ నేల మీద ఉన్న రాళ్లు సైతం ఆనందబాష్పాలు కారుస్తాయి. కానీ, నాడు ప్రాజెక్టు మొదలుపెట్టినప్పటి నుంచి నేడు పాలమూరు గుండెల మీద కృష్ణమ్మ తాండవం చేసేవరకూ ప్రతీ అడుగులో అడ్డంకులు సృష్టించిన ప్రతిపక్షాల కండ్లల్లో మాత్రం నిప్పులు దుంకుతున్నాయి.

ఆరు దశాబ్దాల పాలమూరు కరువుకు కారణం ఐనోళ్లే. వారు ఇప్పుడు పాలమూరు పాదాలను కడుగుతున్న కృష్ణమ్మను చూసి కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. వాళ్లే.. కాల్వలు తవ్వుతుంటే కాళ్ళల్లో కట్టెలు పెట్టారు. వాళ్లే.. రిజర్వాయర్లు కట్టిస్తుంటే రాళ్లు విసిరారు. వాళ్లే.. కొండలను పిండిచేసి సొరంగాలు తవ్వుతుంటే కోర్టుల్లో కేసులు వేశారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రవాహంలా దూసుకెళ్లటమే తెలిసిన నదులే ఆదర్శం. అందుకే దూసుకెళ్లే దారిలో ఎదురొచ్చిన దుష్మన్‌లందర్నీ దాటుకుంటూ లక్ష్యాన్ని ముద్దాడారు. ప్రతీ అడుగులో ఎదురైన ఆటంకాన్ని అధిగమిస్తూ ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సాకారం చేసి చూపించారు. నీళ్లు లేని నేలకు పచ్చకోక కట్టి నాడు తెలంగాణ కోసం గెలిపించిన గడ్డను కృష్ణమ్మ నీళ్లతో పాలమూరు పాదాలకు జలాభిషేకం చేసి రుణం తీర్చుకున్నారు.

కరువు వల్ల వలసపోయిన నేల మీదినుంచి కరువునే వలసపోయేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది. పచ్చదనంతో పాటు, పట్నంపోయిన పల్లెలన్నీ పొలాల్లోకి తిరిగివచ్చేలా చేసిన తెలంగాణ జల విధాత కేసీఆర్. ఆయన సంకల్పానికి కాళేశ్వరమై పొంగుతున్న గోదావరితో పాటు, కృష్ణమ్మగా ఉప్పొంగుతున్న పాలమూరు సైతం ఆ మహా మనీషికి తమ ఆనందబాష్పాలతో అభిషేకం చేస్తున్నాయి. రైతుబిడ్డ రాజైతే రైతు కూడా రాజవుతాడనే నిజం తెలంగాణలో పచ్చబడ్డ ప్రతీ ఎకరానికి తెలుసు. ఆ సంగతి అలుగు దుంకుతున్న ప్రతి చెరువూ, పరుగులు పెడుతున్న ప్రతి కాల్వ, పొంగుతున్న ప్రతి వాగూ, నవ్వుతున్న ప్రతి రైతూ కండ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి.



ఇంగ్లీష్ రమేష్
90630 92644



## తెలంగాణ నమస్తే!

వ్యవసాయం ఆయాసంగా
మారిన ఆ రోజులు
వర్షాలకై ఎదురుచూపులు
అవి రాక కన్నీళ్లతోనే తడారిన
బతుకులు!

మందు సంచులకై
దుకాణాల ముందు చెప్పుల బాటలు
చేతికర్ర చేయూతగా కునికిపాట్లు
ఆకలితో అలమటించిన ఇక్కట్లు!

కరెంటు కోసం కండ్లల్లో వొత్తులు
తీగలు దండాల వరుసలుగా!
పెట్టుబడులు లేక ఆస్తుల తాకట్టు
కుదువపెట్టిన తాళిబొట్టు!

ఆడపిల్ల పెండ్లికుంటే
చేయలేక పెండ్లి ఆలస్యమైతే
లోకుల ఎగతాళి తట్టుకోలేక
ఎన్ని తాళ్ళు ఉరితాళ్లయ్యాయో?

నేడు కనురెప్ప పాటు కూడా
కోతలు లేని కరెంటు
కళకళలాడే జలసిరులు
నేల తనువు అణువణువు తడుపు!

రైతుబంధుతో రైతుకు
పెట్టుబడికి లేని బాదర బంది
ధాన్యం రాశులు రాశులుగా
మార్కెట్లన్నీ నిండుకుంటున్న వైనం!

ఇంటిలక్ష్మిని కల్యాణలక్ష్మి
పలుకరిస్తున్న అనుభూతులు
ఆరోగ్యం మహాభాగ్యంగా
ఆరోగ్యశ్రీ అందరికీ రక్షగా!

తెలంగాణాన సాంఘిక మార్పులు
సాంస్కృతిక విజయాలు
తెలంగాణ యాస విలన్ భాష కాదంటూ
ఆస్కార్‌కు మన నాటు పాట!

ఈ విజయాలన్నీ నాడు కలలు
నేడు నెరవేరిన స్వప్నాలు
ఇన్ని సాధించిన తెలంగాణకు నమస్తే!
మంచి అన్నది మంచిదే కదా విస్తరిస్తే!!



జి.జగ్గయ్య
98495 25802

# దక్షిణాదిపై జాతీయపార్టీల దాష్టీకం

75 ఏండ్ల స్వతంత్ర భారతాన్ని పాలిస్తున్న జాతీయపార్టీలు దక్షిణాది రాష్ట్రాలపై ఆది నుంచి వివక్షే చూపిస్తున్నాయి. నిధుల కేటాయింపు కావచ్చు, రాజకీయ ప్రాతినిధ్యం కావచ్చు ఇలా ఏ అంశాన్ని చూసినా దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. నేడు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, నాడు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ కంటే మరో అడుగు ముందుకువేసి దక్షిణాది రాష్ట్రాలపై తన ఆధిపత్యాన్ని చెలాయిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నది. తత్ఫలితంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు రావాలసిన నిధులు సైతం సక్రమంగా రావడం లేదు. అందువల్ల పలు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి నమూనా కనిపించడం లేదు. అంటే, దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర నిధుల్లేకుండా అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి.



జి.రాజేష్ నాయక్
96035 79115



డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని బీజేపీ ప్రజలను నమ్మబలుకుతున్నది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం కేంద్ర సర్కారు నిధులు అందకున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనా విధానాలతో స్వరాష్ట్ర ఆదాయ నిధులతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది.

తెలంగాణపై కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఆగదనే విషయాన్ని ఢిల్లీ పెద్దలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల జనాభా సుమారుగా 28 కోట్లు ఉంటుందని అంచనా. మరోవైపు దక్షిణాది రాష్ట్రాలు ఆదాయంలో దేశంలోనే అగ్రభాగాన నిలుస్తుండటం గొప్ప విషయంగా భావించాలి. దేశ జీడీపీలో ఎక్కువగా చెల్లించేది ఈ రాష్ట్రాలే కావడం గమనార్హం. ఒకరకంగా చెప్పాలంటే దక్షిణాది రాష్ట్రాలు అందించే రెవెన్యూతోనే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదని చెప్పక తప్పదు.

భారతదేశ పార్లమెంట్‌లో 543 స్థానాలుంటే ఒక్క యూపీ నుంచి 80 స్థానాలున్నాయి. ఇప్పటివరకు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ప్రధాన మంత్రులు 15 మంది ఉంటే అందులో 9 మంది యూపీకి చెందిన నాయకులే. దక్షిణాది రాష్ట్రాల నుంచి భారతదేశానికి ప్రధానమంత్రిగా ప్రాతినిధ్యం వహించిన నాయకులు ఇద్దరే ఉన్నారు. అందులో ఒకరు పీవీ నరసింహారావు ఐదేండ్లు పూర్తిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తే, కర్ణాటకకు చెందిన దేవేగౌడ ఏడాది కూడా ప్రధానిగా కొనసాగలేకపోయారు. దేశ జనాభాలో 20 శాతం జనాభా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉంటే ఇక్కడి ప్రజలు పన్నుల రూపంలో కేంద్రానికి కట్టేది మాత్రం 30 శాతానికి పైగానే ఉంటుందని ఆర్థికవేత్తల అభిప్రాయం.

ఒకసారి దక్షిణాది రాష్ట్రాల్లోని ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులు తిరిగి ఆ రాష్ట్రాలకు ఎంత మొత్తంలో వస్తున్నాయో చూస్తే సగటున ఏపీకి రూ.100కు గాను రూ.67 తిరిగిస్తే, అదే కర్ణాటక పన్నుల రూపంలో రూ.100 కడితే వారికి కేంద్రం నుంచి తిరిగి రూ.47 మాత్రమే వస్తున్నాయి. అదే తమిళనాడు రూ.100కు గాను రూ.40 మాత్రమే కేంద్రం తిరిగి ఇస్తున్నది. మరీ దారుణంగా తెలంగాణకు రూ.100 పన్నుల రూపంలో చెల్లిస్తే తిరిగి కేంద్రం నుంచి సహాయంగా రూ.30 మాత్రమే అందుతున్నాయి. అదేవిధంగా కేరళ చూసుకుంటే రూ.25 మాత్రమే సహాయం రూపంలో అందుతున్నాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలను తీసుకుంటే యూపీ రాష్ట్ర ప్రజలు పన్నుల రూపంలో రూ.100 చెల్లిస్తే వారికి కేంద్రం నుంచి సహాయంగా రూ.180 అందుతున్నాయి. అదే బీహార్ రూ.100 పన్నుల రూపంలో కడితే వారికి రూ.90 సహాయంగా కేంద్రం నుంచి అందుతున్నాయి. మధ్యప్రదేశ్‌కు రూ.75, మిగతా రాష్ట్రాలకు వారు కట్టిన దానికంటే ఎక్కువ మొత్తంలోనే కేంద్రం నుంచి సహాయంగా అందుతున్నాయి.

తెలంగాణ ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు కేంద్రానికి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు రూ.2.72 లక్షల కోట్లు అయితే, అదే కేంద్రం నుంచి నిధుల రూపంలో తెలంగాణకు వచ్చింది కేవలం 1.40 లక్షల కోట్లు మాత్రమే. అంటే ఆర్థిక వివక్ష ఏ మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష ఎంత మేరకు ఉందో చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు. 2022- 23 బడ్జెట్లో సదరన్ రైల్వే కొత్త లైన్ల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులు మొత్తం 59 కోట్లు, అదే ఉత్తరాది రైల్వే అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులు రూ.13,200 కోట్లు... ఈ వివక్ష చూస్తుంటే 'సొమ్మొకడిది సోకొకడిది' అన్న సామెత గుర్తుకు వస్తున్నది. జనాభా నియంత్రణ అమలు దక్షిణాది రాష్ట్రాల్లో సక్రమంగా చేయడంతో ఇక్కడ జనాభా తగ్గి ఉత్తరాదిన జనాభా పెరిగింది. ఆ కోణంలో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గించాలని చూస్తే దక్షిణాది ప్రజలు చూస్తూ ఊరుకోరు. దేశంలో అత్యున్నతమైన పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల మీద చిన్నచూపు అనేది వారి దాష్టీక నిర్ణయానికి సూచిక.

ఉత్తరాదిపై అమిత ప్రేమను చూపిస్తూ, దక్షిణాది రాష్ట్రాలపై వివక్షను చూపించే కేంద్రంలోని బీజేపీ సర్కార్ మరో ఏకపక్ష నిర్ణయాన్ని తీసుకొచ్చింది. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటులో సంచలనాలు సృష్టిస్తున్న తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల దూకుడుకు కళ్లెం వేస్తున్నది.

యూపీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో వైద్య సదుపాయాలు మెరుగయ్యేవరకూ దక్షిణాదికి కొత్త మెడికల్ కాలేజీలను, అదనపు సీట్లను మంజూరు చేయబోమని ఒకరకంగా తెగేసి చెప్పింది. నేను బాగుపడను, నాతో పాటున్న వాళ్లను కూడా బాగు పడనివ్వను అన్నట్టుగా ఉన్నది కేంద్రంలోని బీజేపీ తీరు. దక్షిణాది రాష్ట్రాల సొమ్మునంతా ఉత్తరాదిన ఖర్చుపెడుతున్న మోదీ సర్కార్, ఇప్పుడు ఏకంగా ఇక్కడి ప్రగతిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నది.

దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపడం లేదని చెప్పుకోవడానికి ఎన్నడూ లేనివిధంగా బీజేపీ పెద్దలు తెలంగాణలో విరామం లేకుండా పర్యటిస్తున్నారు. ప్రధాని మోదీ ఈ ఏడాదిలోనే మూడుసార్లు తెలంగాణాలో పర్యటించారు. ఈ పర్యటనలు తమ పార్టీ కార్యకలాపాలకు మాత్రమే కానీ, తెలంగాణ అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడని పర్యటనలు. కాబట్టి పర్యటనలకు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణకు వచ్చే నిధులు కూడా చెల్లిస్తే బాగుంటుంది. అప్పుడే బీజేపీ పెద్దల పర్యటనలకు ఒక సార్థకత ఉంటుంది. లేకుంటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు. అవసరమైతే ఢిల్లీ పెద్దలపై పోరాటానికి సైతం సిద్ధపడతారు.

## ఆప్‌పై బీజేపీ కక్ష

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) నాయకులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నది. అందులో భాగంగానే మనీష్ సిసోడియా లాంటి వ్యక్తులు అకారణంగా జైల్లో మగ్గుతున్నారు. ఇప్పటికే మా నాయకులపై 170 అవినీతి కేసులు మోపింది. అందులో 140 తప్పుడు కేసులని కోర్టు తేల్చడం కేంద్ర ప్రభుత్వ పక్షపాతాన్ని తెలియజేస్తున్నది. మా పార్టీని తుదముట్టించడమే బీజేపీ లక్ష్యం అనుకుంటా.!



- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి